ఒట్టేసి చెప్పు.. ఓటు వేస్తానని..

తాయిలం ఇస్తాం.. ప్రతిజ్ఞ చెయ్యండి
ఇదేం విడ్డూరం అంటూ ముక్కున వేలేసుకుంటున్న ఓటర్లు

"ఓ పక్కన ప్రచారం జరుగుతోంది.. మరోవైపు ఓ పార్టీకి చెందిన ద్వితీయ శ్రేణి నాయకుడు కుటుంబ పెద్ద వద్దకు వచ్చాడు. ఓటు వేయాలంటే ఏం కావాలి అని అడిగాడు. కుటుంబ పెద్ద ఏదో చెప్పాడు. సరే పని అయిపోతుంది అని బదులు ఇచ్చిన సదరు నేత కుటుంబసభ్యులంతా తమ పార్టీకి ఓటు వేస్తామని ప్రతిజ్ఞ చేయాలని కోరాడు. అంటే కుటుంబ పెద్ద నిర్ఘాంత పోయాడు. ప్రతిజ్ఞ చేసేది లేదు అంటూ తెగేసి చెప్పాడు."

"చిన్నపాటి అపార్ట్‌మెంట్‌కు వెళ్లిన ఓ ప్రజాప్రతినిధి తమ పార్టీకి ఓట్లు వేయాలని కోరాడు. బదులుగా అపార్ట్‌మెంట్ మొత్తం సీసీ కెమెరాలు పెడతా అని చెప్పాడు. అసోసియేషన్ సరే అని చెప్పాక ఫ్లాట్ ఓనర్స్ అందరూ ఓటు వేసేలా అగ్రిమెంట్ చేసుకుందామా అని అడిగాడు. దీంతో అసోసియేషన్ అతడిని తరిమేసింది."



యూసుఫ్‌గూడ, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ఎన్నికలు ఏవైనా కావచ్చు.. ఎక్కడైనా ఎప్పుడైనా రావచ్చు.. స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకున్నప్పుడే విలువ ఉంటుంది. 70 సంవత్సరాలుగా ఆయా రాజకీయ పార్టీలు ప్రజలకు అందించిన పథకాలు, చేసిన అభివృద్ధిని బట్టి ఓటర్లు పార్టీలకు ఓటు బ్యాంక్‌గా మారారు. కొంతమంది పలు పార్టీలకు చెందిన నాయకులు ప్రజలకు సేవ చేసేందుకు రాజకీయాల్లోకి వచ్చి తన వంతు అప్పుడప్పుడు ఉడుతా భక్తి సాయం చేస్తుంటారు. వారికి కూడా ప్రజల్లో కొంతమంది అనుచరులు ఉంటారు. ఇవన్నీ ఒక భాగమైతే రాజకీయాలతోనూ, ప్రజాప్రతినిధులతోనూ ఎలాంటి సంబంధం లేకుండా తటస్థంగా ఉండే ఓటర్లు ఉంటారు. ఈ ఓటు బ్యాంక్ గెలుపుపై ప్రభావం చూపిస్తుంది. రాజకీయ పార్టీల ఎత్తుగడలు, ఆయా పార్టీ అభ్యర్థుల వ్యూహాలు తటస్థంగా ఉండే ఓటు బ్యాంక్‌ను చేరుకోవడానికి తాయిలం ఎర చూపుతారు. ప్రస్తుతం జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక పోలింగ్ పక్షం రోజులు ఉంది. నియోజకవర్గ పరిధిలోని రహ్మత్ నగర్‌లో ఓ గుంపును(కొంతమంది) కలవడానికి ఓ పార్టీకి చెందిన ద్వితీయ శ్రేణి నాయకత్వం వెళ్లారు. గుంపుగా ఉన్న ఓటర్లను ఆకర్షించడానికి మాట్లాడుతున్న సందర్భంలో తాయిలం ఇస్తాం.. ప్రతిజ్ఞ చేయాలని కోరారు. వెంటనే ఆ గుంపులోని ఓటర్లు స్పందిస్తూ తాయిలం వద్దు, ప్రతిజ్ఞ చెయ్యం మాకు ఇష్టం వచ్చిన అభ్యర్థికి స్వేచ్ఛగా ఓటేస్తామని నికార్సుగా చెప్పారు.

తటస్థ ఓటరును చేరడం ఎలా?

ఉప ఎన్నికలో గెలుపే లక్ష్యం చేసుకొని ప్రధాన పార్టీల అభ్యర్థులు ప్రచారాన్ని ముమ్మరం చేశారు. ఎలాగైనా గెలవాలని వ్యూహాలతో ప్రచారంలో ముందుకు సాగుతున్నారు. బోరబండ, రహ్మత్ నగర్, ఎర్రగడ్డ, వెంగళరావునగర్, షేక్‌పేట డివిజన్‌ల పరిధిలో నాలుగు లక్షల మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో ఎక్కువగా మైనార్టీ, ఎస్సీ, ఎస్టీ, బీసీ ఓటర్లు ఉన్నారు. కొందరు ఆయా పార్టీల వైపు మొగ్గు చూపిస్తున్నారు. మరికొందరు తటస్థంగా ఉంటున్నారు. వీరిని ఆకట్టుకునేందుకు అన్ని పార్టీల నేతలు, కార్యకర్తలు వ్యూహాలు రచిస్తున్నారు. నేరుగా వెళ్లి తటస్థంగా ఉండే వారితో చర్చలు జరుపుతున్నారు. పలు హామీలు ఇస్తున్నారు. ఎలాగైనా తమ పార్టీ అభ్యర్థికి ఓటు వేయాలని కోరుతున్నారు.

నిరుత్సాహంలో ఓటరు..

అభ్యర్థుల తరఫున ద్వితీయ శ్రేణి నాయకులు, బస్తీల లీడర్లు రంగంలోకి దిగి ఓటర్లను ఆకర్షించడానికి నగదు బహుమతిని ప్రకటిస్తున్నట్టు విశ్వసనీయ సమాచారం. ద్వితీయ శ్రేణి నాయకుడు ప్రకటించే నగదు బహుమతికి ఓటరు నిరుత్సాహంగా ఉన్నట్టు తెలుస్తోంది. సామాజిక మాధ్యమాలలో ఓటరుకు భారీ స్థాయిలో తాయిలం అంటూ ప్రచారంలో ఉంది కదా, మీరేంటి ఇంత తక్కువ ఇస్తున్నారంటూ నిరుత్సాహంతో మొహం తిప్పుతున్నారు. ఇంకా పక్షం రోజులు ఉండగానే ఇంత ముందుగా ఎందుకు తీసుకోవాలి, తర్వాత అయితే ఎక్కువ డబ్బులు వస్తాయి కదా, అన్న ఆలోచనలో ఓటర్లు ఉన్నట్టు సమాచారం.


మాట్లాడుతున్న ప్రముఖ మెజీషియన్ జాదూగార్ సికిందర్

జాదూగార్ సికిందర్ గాలా మ్యాజిక్ షో

- రేపటి నుంచి సికింద్రాబాద్ హరిహర కళాభవన్‌లో..

పంజాగుట్ట, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): నగర ప్రజలను అలరించేందుకు మొట్టమొదటిసారిగా సికింద్రాబాద్‌లోని హరిహర కళాభవన్‌లో ఆర్‌ఎం ఎంటర్‌ప్రైజెస్ ఆధ్వర్యంలో ప్రముఖ మెజీషియన్ జాదూగార్ సికిందర్ గాలా మ్యాజిక్ షో ప్రారంభం కానుంది. రేపటి నుంచి నవంబరు 30 వరకు ప్రతీ రోజు మూడు షోలు ప్రదర్శించనున్నారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ప్రముఖ మెజీషియన్ జాదూగార్ సికిందర్, ప్రదీప్, సంపత్, రెహమాన్, ఆసీఫ్‌తో కలిసి వివరాలు వెల్లడించారు. ఈ సంవత్సరం మ్యాజిక్ షోలో విభిన్న ఆవిష్కరణలు ఉంటాయని సికిందర్ తెలిపారు. తమ బృందంతో కలిసి డైనోసార్ భ్రమ కల్పించే ఆవిష్కరణలు, బెర్ముడా ట్రయాంగిల్ ఎఫెక్ట్, ఇతర అనేక ఉత్కంఠ భరితమైన విన్యాసాలు ప్రదర్శిస్తామని, ప్రత్యేక కామెడీ షో కూడ ఉంటుందని సికిందర్ తెలిపారు.

తెలంగాణ సినీ కార్మికులపై వివక్ష

బంజారాహిల్స్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రం వచ్చి పదకొండేళ్లు అవుతున్నా అటు ప్రభుత్వం నుంచి ఇటు తెలుగు సినిమా ఇండస్ట్రీ నుంచి తెలంగాణ సినీ కార్మికులపై వివక్షే కొనసాగుతున్నదని తెలంగాణ సినిమా ఇండస్ట్రీ ఎంప్లాయీస్ ఫెడరేషన్ అధ్యక్షుడు కరుణాకర్‌రెడ్డి ఆరోపించారు. బుధవారం ఇందిరానగర్‌లోని ఫెడరేషన్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. సినీ ఇండస్ట్రీ కార్మికుల కోసం సీఎం నిర్వహించిన సమావేశానికి తెలంగాణ సినిమా ఇండస్ట్రీ యూనియన్లను ఆహ్వానించకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. సినిమా ఇండస్ట్రీలో తెలంగాణలోని 24 క్రాఫ్ట్స్ నుంచి సుమారు 4 వేల మందికి పైగా కార్మికులు పని చేస్తున్నారని, సినీ పెద్దలు, ప్రభుత్వ పెద్దలు తమను పట్టించుకోకపోవడం సమంజసం కాదని పేర్కొన్నారు. యూసుఫ్‌గూడ పోలీస్ లైన్‌లో జరిగిన సీఎం అభినందన కార్యక్రమానికి తమకు కనీసం ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ దిల్ రాజు నుంచి కూడా ఆహ్వానం అందలేదని, తమ కార్మికులు అంటే ఇంతటి వివక్ష ఎందుకని ప్రశ్నించారు. సమావేశంలో ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి మూర్తి, కోశాధికారి ఠాగూర్ పాల్గొన్నారు.

ఓటును సద్వినియోగం చేసుకోవాలి

పంజాగుట్ట, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): నగరంలో ఏ ఎన్నికలు వచ్చినా ఓటింగ్ శాతం తక్కువ ఉంటున్నదని, చదువుకున్న వారు ఓటు వేసేందుకు దూరంగా ఉంటున్నారని సమాచార హక్కు పరిరక్షణ సమితి, ఎలక్షన్ వాచ్ కమిటీ జాతీయ ఛైర్మన్ డాక్టర్ బొమ్మరబోయిన కేశవులు ముదిరాజ్ అన్నారు. ప్రజల్లో ఉన్న ఈ అభిప్రాయాన్ని తొలగించేందుకు జూబ్లీహిల్స్ ఉపఎన్నిక చక్కని అవకాశం అని, ప్రతీ ఒక్కరూ ఓటును సద్వినియోగం చేసుకుని వంద శాతం ఓటింగ్ నమోదు చేయాలని ఆయన పిలుపునిచ్చారు. బుధవారం జూబ్లీహిల్స్‌లోని ఓజోన్ యూనివర్సిటీ ప్రాంగణంలో సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఓటరు అవగాహన ర్యాలీ, సమావేశంలో ఆయన మాట్లాడారు. పోలింగ్ రోజు సెలవు అని భావించకుండా ఓటు వేయడం హక్కుగా భావించాలన్నారు. ఒకవేళ పోటీ చేసే అభ్యర్థులు ఎవరూ నచ్చని పక్షంలో నోటాకు ఓటు వేయాలని, ఎట్టి పరిస్థితుల్లో ఓటు వేయకుండా ఉండొద్దని అన్నారు. కార్యక్రమంలో సంతోష్, కృష్ణ, నరేందర్, శ్వేత,విద్య, శ్రీదేవి, ప్రత్యూష, ఎం.శ్రీహరి, ఎం.మధు, పి.సాయికృష్ణ, స్వప్న, ప్రవళిక పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణ అందరి బాధ్యత

అమీర్‌పేట, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాల నివారణ అందరి బాధ్యత అని బేగంపేట టీటీఐ ఇన్‌స్పెక్టర్ అశోక్ అన్నారు. రోడ్డు భద్రతపై బుధవారం ఎస్‌ఆర్‌నగర్ లోని అవినాష్ కళాశాల ఆఫ్ కామర్స్ విద్యార్థులకు 'సెల్‌ఫోన్ డ్రైవింగ్ అతి ప్రమాదకరం, నిర్లక్ష్యం డ్రైవింగ్‌తో ప్రాణాలు పోగొట్టుకుంటున్న యువత' అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ రోడ్డు ప్రమాదాల నివారణకు సహకరించాలన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ స్వప్నారాణి, బేగంపేట టీటీఐ సిబ్బంది సాయి కుమార్, కృష్ణతో పాటు 120 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

ఇన్ఫోసిస్ ఉద్యోగిపై కేసు నమోదు

అమీర్‌పేట, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): బల్కంపేటలోని నేచర్ మైత్రి అపార్ట్‌మెంట్‌లో చోటుచేసుకున్న ఓ గొడవలో గృహిణితో అసభ్యంగా ప్రవర్తించిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌పై ఎస్‌ఆర్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. అక్టోబరు 26న రాత్రి ఫ్లాట్ నెంబర్. 502 నివాసి, ఇన్ఫోసిస్ ఉద్యోగి బొమ్మినేని శ్రీవరుణ్ కారును అతివేగంగా నడిపి అక్కడున్న వారిని వీడియో తీస్తున్నాడు. దీనిపై హెచ్‌ఆర్ ఎగ్జిక్యూటివ్ మాదల శ్రీలత(36) భర్త అభ్యంతరం వ్యక్తం చేశారు. శ్రీవరుణ్ ఆయనతో గొడవకు దిగాడు. ఈ ఘర్షణను ఆపేందుకు ప్రయత్నించిన శ్రీలతను, ఆమె అత్తను, కుమార్తెను కూడా శ్రీవరుణ్ అసభ్యకరమైన భాషలో దూషించాడు. శ్రీలత ఫిర్యాదు మేరకు పోలీసులు శ్రీవరుణ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడు ఆత్మహత్య

అమీర్‌పేట, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ఎస్‌ఆర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. నల్గొండ జిల్లా నకిరేకల్‌కు చెందిన మనోజ్‌కుమార్(28) అమీర్‌పేటలోని హాస్టల్‌లో ఉంటూ గచ్చిబౌలిలోని ఓ ప్రైవేట్ సంస్థలో పనిచేస్తున్నాడు. మంగళవారం విధులకు వెళ్లకుండా గదిలోనే ఉండిపోయాడు. సహచరుడైన శివారెడ్డి రాత్రి గదికి వచ్చి తలుపు తీసి చూడగా ఉరేసుకుని కనిపించాడు. అమ్మ,నాన్న, తమ్ముడు, చెల్లి క్షమించడంటూ సూసైడ్ నోట్ రాసి పెట్టాడు. ఎస్‌ఆర్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

2న ప్రకృతి ఆరోగ్య మహోత్సవ్-2025

పంజాగుట్ట, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం జిల్లా నేలకొండపల్లిలోని సిద్ధార్థ యోగా విద్యాలయం ఆధ్వర్యంలో ప్రకృతి వైద్యాన్ని ప్రజల్లోకి మరింతగా విస్తరించేందుకు నవంబరు 2న వనస్థలిపురంలోని ఎంఈ రెడ్డి ఫంక్షన్ హాల్‌లో ప్రకృతి ఆరోగ్య మహోత్సవ్-2025ను నిర్వహిస్తున్నారు. ఇందుకు సంబంధించిన కరపత్రాన్ని ప్రముఖ ప్రకృతి వైద్య నిపుణులు డాక్టర్ రామచంద్ర బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆవిష్కరించి వివరాలు వెల్లడించారు. ఆధునిక విజ్ఞాన ప్రభావంతో ప్రజల జీవనశైలిలో కృత్రిమ పద్ధతులు వచ్చి చేరాయని, అనేకమంది దీర్ఘకాలిక రోగాలతో సతమతమవుతున్నారని అన్నారు. మారిన జీవనశైలిని సహజ జీవనశైలిగా మార్చుకోవడమే జబ్బులకు పరిష్కారమని పేర్కొన్నారు. కార్యక్రమంలో సిద్ధార్థ యోగా విద్యాలయం సభ్యులు కొల్లి వెంకటఅప్పారావు, కె.శ్యామ్‌సుందర్, ప్రసాద్, ఎం.ఇంద్రాణి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పంజాగుట్ట, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): గ్రీన్‌ల్యాండ్స్ ఏడీఈ పరిధిలోని పలు ప్రాంతాల్లో గురువారం విద్యుత్ అంతరాయం ఉంటుందని ఏడీఈ వంశీకృష్ణ తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు 11 కేవీ ఆదిత్య ఎన్‌క్లేవ్, శ్రీనివాసనగర్ ఈస్ట్ ఫీడర్ల పరిధిలోని పలు ప్రాంతాలు, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు 11కేవీ ఆర్‌బీఐ ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లోనూ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ పేర్కొన్నారు.


పీజేఆర్ తనయ విజయారెడ్డి, మహిళా కాంగ్రెస్ నాయకురాలు హబీబా సుల్తానాతో కలిసి బోరబండలో ప్రచారం చేస్తున్న నవీన్ యాదవ్ సతీమణి వర్ష యాదవ్


ప్రచారంలో భాగంగా రొట్టె కాలుస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి నవీన్‌యాదవ్


ప్రచారం చేస్తున్న ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి

స్థానికుడిని దీవించండి : నవీన్‌యాదవ్

బంజారాహిల్స్/బోరబండ, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): స్థానికంగా ఉండే తనను దీవించి భారీ మెజార్టీతో గెలిపించాలని జూబ్లీహిల్స్ కాంగ్రెస్ అభ్యర్థి నవీన్‌యాదవ్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, స్థానిక కార్పొరేటర్ వనం సంగీతాశ్రీనివాస్‌యాదవ్‌తో కలిసి ఎల్లారెడ్డిగూడ, అంబేడ్కర్‌నగర్, లా కాలేజీ, సుభాష్‌నగర్‌లో బుధవారం ఆయన ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదవి ఉన్నా, లేకున్నా తాను ఎప్పుడూ ప్రజల్లోనే ఉన్నానని గుర్తు చేశారు. తాను విజయం సాధిస్తే ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు తొలి ప్రాధాన్యం ఇస్తానని చెప్పారు. కార్యక్రమంలో ఏఐసీసీ కో-ఆర్డినేటర్ పీవీ రవిశేఖర్‌రెడ్డి, స్థానిక నాయకులు గొంటి సాయినాథ్‌యాదవ్, మాజీద్, సాయి యాదవ్ పాల్గొన్నారు.

భర్త కోసం..

నవీన్ యాదవ్ సతీమణి వర్ష యాదవ్ బోరబండ బలహీనవర్గాల కాలనీలో ప్రచారం చేశారు. పీజేఆర్ తనయ పి.విజయారెడ్డి, మహిళా కాంగ్రెస్ నాయకురాలు హబీబా సుల్తానాతో కలిసి వీకర్ సెక్షన్‌లో ఇంటింటికీ తిరిగి కరపత్రాలను పంపిణీ చేశారు.


సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరిన బీజేపీ సెంట్రల్ జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు, మాజీ కార్పొరేటర్ కిలారి మనోహర్

కాంగ్రెస్ పార్టీలో చేరిన కిలారి మనోహర్

పంజాగుట్ట, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): బీజేపీ సెంట్రల్ జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు, వెంగళరావునగర్ మాజీ కార్పొరేటర్ కిలారి మనోహర్ సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో బుధవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. కొన్ని రోజులుగా రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆయనతో చర్చలు జరిపారు. సీఎం కూడా ఆయనతో మాట్లాడినట్టు తెలిసింది. దీంతో మనోహర్ పార్టీ మారేందుకు సుముఖత వ్యక్తం చేశారు. మంత్రి తుమ్మల ఆయనను రేవంత్‌రెడ్డి వద్దకు తీసుకెళ్లారు. సీఎం సమక్షంలో టీపీసీసీ ఉపాధ్యక్షుడు బండి రమేష్ కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి మనోహర్‌ను పార్టీలోకి ఆహ్వానించారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ విజయానికి కృషి చేస్తానని ఈ సందర్భంగా కిలారి మనోహర్ తెలిపారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర నాయకుడు బి.నాగేశ్వర్ రావు పాల్గొన్నారు.

ఉప ఎన్నికను సవాల్‌గా తీసుకోవాలి

- బీజేపీ జాతీయ కార్యదర్శి సునీల్ బన్సాల్



సమావేశంలో మాట్లాడుతున్న రామచందర్‌రావు

ఎర్రగడ్డ, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఉప ఎన్నికను సవాల్‌గా తీసుకోవాలని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి సునీల్ బన్సాల్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ప్రచారంలో భాగంగా ఎర్రగడ్డ రాయల్ కమ్యూనిటీ ఫంక్షన్ హాల్‌లో బుధవారం రాత్రి జరిగిన పార్టీ సమన్వయకర్తలు, ఇన్‌చార్జీల సమావేశంలో ఆయన మ్లాటాడారు. పది రోజుల్లో ప్రతీ ఓటరును కలవాలని సూచించారు. కేంద్రంలో నరేంద్ర మోదీ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాల గురించి గడపగడపకూ వివరించాలని కోరారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి మాట్లాడుతూ బీజేపీని గెలిపించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావు మాట్లాడుతూ తెలంగాణలో బీజేపీ విజయం ఎందుకు అవసరమో ఓటర్లకు చెప్పాలని సూచించారు. సమావేశంలో మెదక్ ఎంపీ రఘునందన్‌రావు, ఎమ్మెల్సీ మల్క కొమరయ్య, మాజీ ఎంపీ జి.మోహన్‌రావు, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్.గౌతమ్‌రావు, వేముల అశోక్, వీరేందర్‌గౌడ్, జయశ్రీ, మాధవి, ప్రేమేందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. కాగా, మోతీనగర్ చౌరస్తాలో కిషన్‌రెడ్డి కాన్వాయ్ ట్రాఫిక్‌లో చిక్కుకుంది. దీంతో ఆయన కారు దిగి నడుచుకుంటూ సమావేశానికి వెళ్లారు.

కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పండి : బీఆర్‌ఎస్


శ్రీనగర్ కాలనీలో పాదయాత్ర చేస్తున్న బీఆర్‌ఎస్ అభ్యర్థి సునీత, మాజీ మంత్రి సబితాఇంద్రారెడ్డి

యూసుఫ్‌గూడ, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల హామీలను విస్మరించిన కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పాలని బీఆర్‌ఎస్ అభ్యర్థి మాగంటి సునీత, మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి, ఎంఎల్‌సీ నవీన్ కుమార్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం శ్రీనగర్‌కాలనీ వడ్డెర బస్తీ, సుభాష్‌నగర్ బస్తీల్లో వారు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ పాలనంతా ప్రభుత్వ భూముల కబ్జాలు, దౌర్జన్యాలతోనే సాగిందని విమర్శించారు. జూబ్లీహిల్స్ ప్రజల కష్టసుఖాలలో మూడు పర్యాయాలు అండగా ఉన్న మాగంటి కుటుంబాన్ని ఈ ఎన్నికలో ఆదరించి ఓటు వేయాలని కోరారు. కృష్ణానగర్, లక్ష్మీనరసింహ నగర్ బస్తీల్లోనూ బీఆర్‌ఎస్ కార్యకర్తలు ప్రచారం చేశారు.

కేసీఆర్ చేసిన అభివృద్ధితో గెలుపు

మాజీ సీఎం కేసీఆర్ చేసిన అభివృద్ధి పనులే సునీతను గెలిపిస్తాయని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. రహ్మత్‌నగర్ డివిజన్ సంజయ్ నగర్‌లో ఆయన మాజీ ఎమ్మెల్యేలు విష్ణువర్ధన్‌రెడ్డి, ఎస్.రాజేందర్‌రెడ్డితో కలిసి వర్షంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మాజీ కార్పొరేటర్ మహేష్ యాదవ్‌తో కలిసి ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి ప్రచారం చేశారు. షేక్‌పేట డివిజన్ పరిధిలోని సీతానగర్, గంగపుత్ర కాలనీలో బీఆర్‌ఎస్ అభ్యర్థి సునీతతో కలిసి ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి పాదయాత్ర చేశారు. కార్యక్రమంలో నాయకులు తుల ఉమ, అయేషా ఫాతిమా, ప్రదీప్, చెరిక మహేష్ పాల్గొన్నారు.

అందరి దృష్టి ఉప ఎన్నికపైనే

- ప్రచారంలో దూసుకుపోతున్న కాంగ్రెస్, బీఆర్‌ఎస్
- హస్తగతం చేసుకోవాలని కాంగ్రెస్
- పట్టు నిలుపుకోవాలని బీఆర్‌ఎస్



యూసుఫ్‌గూడ, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): అందరి దృష్టి జూబ్లీహిల్స్ ఉపఎన్నిక పైనే ఉన్నది. పది మంది ఎక్కడ గుమిగూడినా ఉపపోరు గురించే చర్చించుకుంటున్నారు. మాగంటి గోపీనాథ్ అకాల మరణంతో వచ్చిన ఉప ఎన్నిక ప్రధానంగా కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీలకు ప్రతిష్ఠాత్మకంగా మారింది. పూర్వ ఉమ్మడి ఖైరతాబాద్ నుంచి జూబ్లీహిల్స్ మాదేనంటూ కాంగ్రెస్ అధిష్ఠానం. 2014 నుంచి హ్యాట్రిక్ గెలుపును సొంతం చేసుకున్న మాగంటి గోపీనాథ్ సతీమణి సునీత ప్రస్తుతం బీఆర్‌ఎస్. నువ్వా-నేనా అనే విధంగా పోటీ పడుతున్నారు. ప్రచారంలో కొత్త ఎత్తుగడలను ప్రదర్శిస్తూ కార్యకర్తలకు, నాయకులకు తాయిలాలు ఎరచూపుతున్నారు.

గతంలో జూబ్లీ హస్తానిదే...

ఉమ్మడి ఖైరతాబాద్ నియోజకవర్గానికి పలుమార్లు ఎమ్మెల్యేగా గెలిచిన నేత పి.జనార్దన్‌రెడ్డి 28 డిసెంబరు 2007న గుండెపోటుతో మరణించారు. 2008 మేలో వచ్చిన ఉప ఎన్నికలో పి.జనార్దన్‌రెడ్డి తనయుడు పి.విష్ణువర్ధన్‌రెడ్డి ఎమ్మెల్యేగా గెలిచారు. రాష్ట్రంలో జరిగిన నియోజకవర్గాల పునర్విభజనలో భాగంగా 2009లో నూతనంగా జూబ్లీహిల్స్ ప్రాంతం లేకుండానే నియోజకవర్గం ఏర్పడింది. అనతి కాలంలోనే 2009 ఏప్రిల్ లో వచ్చిన సాధారణ ఎన్నికలో పి.విష్ణువర్ధన్‌రెడ్డి రెండోసారి ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఆ తర్వాత 2014లో వచ్చిన సాధారణ ఎన్నికలో టీడీపీ అభ్యర్థిగా బరిలో నిలిచిన మాగంటి గోపీనాథ్ విజయం సాధించారు. 2019, 2023లో జరిగిన సాధారణ ఎన్నికల్లో సైతం బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేగా మాగంటి గోపీనాథ్ విజయం సాధించారు. ఎలాగైనా ఈసారి హస్త గతం చేసుకోవాలనే తాపత్రయంలో కాంగ్రెస్ ఉంది. అందుకే ఏడు డివిజన్‌లలో రూ.150 కోట్ల నిధులను కేటాయించి అభివృద్ధి పనులు ప్రారంభించారు.

ఏడు డివిజన్‌లు.. 13 మంది మంత్రులు

జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని ఏడు డివిజన్ల ప్రచార బాధ్యతలను 13 మంది మంత్రులు, ఓ ఎంపీకి కాంగ్రెస్ అధిష్ఠానం అప్పగించింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాలతో ఇప్పటికే మంత్రులు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వల్లాల నవీన్ యాదవ్ గెలుపు కోసం ప్రచారాన్ని ముమ్మరం చేశారు. యూసుఫ్‌గూడ-ఉత్తమ్ కుమార్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, వెంగళరావు నగర్-తుమ్మల నాగేశ్వరరావు, వాకిటి శ్రీహరి, రహ్మత్ నగర్-పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, బోరబండ-సీతక్క, ఎంపీ మల్లు రవి, సోమాజిగూడ డివిజన్ కొంతభాగం శ్రీధర్‌బాబు, అడ్లూరి లక్ష్మణ్, ఎర్రగడ్డ-దామోదర రాజనర్సింహ, జూపల్లి కృష్ణారావు, షేక్‌పేట-కొండా సురేఖ, వివేక్ వెంకటస్వామి పర్యవేక్షణలో వివిధ కార్పొరేషన్‌ల ఛైర్మన్‌లు, డీసీసీ అధ్యక్షులు విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు.

ఎలాగైనా నిలబెట్టుకుంటాం..

సిట్టింగ్ స్థానాన్ని ఎలాగైనా నిలబెట్టుకోవాలనే తాపత్రయంలో బీఆర్‌ఎస్ ఉంది. 2014లో టీడీపీ ఎమ్మెల్యేగా గెలుపొందిన మాగంటి గోపీనాథ్ బీఆర్‌ఎస్‌లో చేరి 2019, 2023లో జరిగిన సాధారణ ఎన్నికల్లో గెలిచి హ్యాట్రిక్ సాధించారు. అందుకే జూబ్లీహిల్స్ మాదే.. ఎలాగైనా నిలబెట్టుకుంటాం అంటూ బీఆర్‌ఎస్ శాసనసభ్యులు, మాజీ మంత్రులు, మాజీ కార్పొరేషన్ ఛైర్మన్‌లు ప్రచారం చేస్తున్నారు.

Format C-1
(for candidate to publish in Newspapers, TV)
Declaration about criminal cases
(As per the judgment dated 25th September, 2018, of Hon'ble Supreme Court in WP (Civil) No. 536 of 2011 (Public Interest Foundation & Ors. Vs. Union of India & Anr.)

Name and address of candidate : **TADI VENKATESWARLU,** S/o Narayana Murthy (Late), Hima Sai Apartments, Nallagandla, Gopanapally, R.R Dist.
Name of political party : **INDEPENDENT**
Name of Election : **MLA BYE-ELECTIONS**
Name of Constituency : **JUBILEE HILLS**

I, Tadi Venkateswarlu a candidate for the above mentioned election, declare for public information the following details about my criminal antecedents:

Sl. No.	Pending criminal cases			Details about cases of conviction for criminal offences	
	Name of Court	Case No. and status of case	Section(s) of Acts concerned and brief description of offence(s)	Name of Court & date(s) of order(s)	Description offence(s) punishment imposed
1	XII Addl. IMF Rajendra Nagar R.R.Dist.	CC/3188/2024	420 IPC financial Matter	Nill	Nill

*In the case of election to Council of States or election to Legislative Council by MLAS, mention the election concerned in place of name of constituency.

Sd/- **Tadi Venkateswarlu**
Independent MLA Candidate
Jubilee Hills Bye-elections



జనహిత సేవా ట్రస్ట్ ఆశ్రమంలో ఉంటున్న వారికి దుప్పట్లు అందజేసిన ఎస్‌బీఐ లేడీస్ క్లబ్ ప్రతినిధులు

జనహిత సేవా ట్రస్ట్‌కు ఎస్‌బీఐ లేడీస్ క్లబ్ చేయూత

అడ్డగుట్ట, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): గాంధీ ఆస్పత్రిలో ఉన్న జనహిత సేవా ట్రస్ట్‌ను ఎస్‌బీఐ (హైదరాబాద్) లేడీస్ క్లబ్ ప్రతినిధులు బుధవారం సందర్శించారు. ఆశ్రమంలో ఉంటున్న వారిని అడిగి వివరాలు తెలుసుకున్నారు. సేవా ట్రస్ట్‌కు ఎస్‌బీఐ లేడీస్ క్లబ్ ప్రతినిధులు రూ. 1.50 లక్షల విలువైన నిత్యావసర వస్తువులతోపాటు మహిళలకు దుప్పట్లు అందజేశారు. క్లబ్ ప్రతినిధులను జనహిత సేవా ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ నరసింహమూర్తి, ట్రస్టీలు నందకుమార్, శ్రీదేవి, వెంకట్ సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు.



నిరాశ్రయులతో ఇన్‌స్పెక్టర్ అనుదీప్, పోలీసులు

నిరాశ్రయులకు పోలీసుల ఆశ్రయం

బౌద్ధనగర్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): వర్షంలో తడుస్తూ ఫుట్‌పాత్‌లపై ఉన్న నలుగురు నిరాశ్రయులకు పోలీసులు ఆశ్రయం కల్పించారు. బుధవారం సాయంత్రం చిలకలగూడలో రోడ్డుపక్కన వర్షంలో తడుస్తూ చలికి వణుకుతున్న నలుగురు వ్యక్తులను ఇన్‌స్పెక్టర్ అనుదీప్ చేరదీశారు. వారి వివరాలు తెలుసుకొని భోజనం పెట్టించారు. అధికారుల సూచన మేరకు వారిని ఆలేటి ఆశ్రమానికి తరలించారు. నిరాశ్రయులకు ఆశ్రయం కల్పించిన చిలకలగూడ పోలీసులను పలువురు అభినందించారు.

బాధితుడికి సీఎంఆర్ఎఫ్ మంజూరు



బాధితుడి కుమారుడికి ఎల్‌వోసీ పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేష్

తిరుమలగిరి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తికి ముఖ్యమంత్రి సహాయనిధి మంజూరైంది. బొల్లారం రిసాలబజార్‌కు చెందిన సయ్యద్ సర్దార్ బాషా అనారోగ్యంతో నిమ్స్‌లో చేరారు. వైద్య ఖర్చులకు రూ. 2.50 లక్షలు ఖర్చవుతుందని వైద్యులు చెప్పడంతోముఖ్యమంత్రి సహాయనిధికి దరఖాస్తు చేసుకోగా ఎల్‌వోసీ పత్రం మంజూరు చేశారు. బాధితుడి కుమారుడికి ఎమ్మెల్యే శ్రీగణేష్ బుధవారం ఎల్‌వోసీ (లెటర్ ఆఫ్ క్రెడిట్) పత్రం అందజేశారు.

వరల్డ్ స్ట్రోక్ డే.. 'గాంధీ'లో అవగాహన ర్యాలీ



వరల్డ్ స్ట్రోక్ డే సందర్భంగా గాంధీ ఆస్పత్రిలో సూపరింటెండెంట్ డాక్టర్ వాణి ఆధ్వర్యంలో బుధవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. న్యూరో విభాగం వైద్యుడు, రమేష్, పీజీ వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

- అడ్డగుట్ట, ఆంధ్రజ్యోతి

అసిస్టెంట్ ప్రొఫెసర్ నియామకంలో అవకతవకలు

- **ఓయూ వీసీకి విద్యార్థి సంఘాల ఫిర్యాదు**

ఉస్మానియా యూనివర్సిటీ, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ఉస్మానియా విశ్వవిద్యాలయంలో లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ నియామకంలో అవకతవకలు జరిగాయని దళిత, గిరిజన, బహుజన విద్యార్థి సంఘాలు ఆరోపించాయి. ఈ మేరకు వివిధ విద్యార్థి సంఘాల ప్రతినిధులు వీసీ ప్రొఫెసర్ కుమార్ మొలుగరంకు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ వివేకవర్ధన్ నియామకం అక్రమమని, ఆయనకు అర్హతలు లేకపోయినా నియమించారని అన్నారు. యూజీసీ నిబంధనలను ఉల్లంఘించి, రోస్టర్ సిస్టమ్, రిజర్వేషన్ విధానాలను విస్మరించి నియామకం జరిగిందని ఫిర్యాదులో పేర్కొన్నారు. వీసీకి వినతిపత్రం అందజేసిన వారిలో విద్యార్థులు మంతెన మధు, డాక్టర్ జంపాల రాజేష్, వెంకట్, భూషణ్, బాలు, శోభన్, సిద్దు తదితరులు పాల్గొన్నారు.



మంగళవారం రాత్రి నుంచి కురుస్తున్న వర్షానికి చెరువును తలపిస్తున్న బోయినపల్లి సీతారాంపురం రోడ్



బోయినపల్లి హర్షవర్ధన కాలనీలో మోకాలి లోతు వరకు చేరిన వర్షం నీరు



నెల్లూరు పోచమ్మ ఆలయం వద్ద వర్షం నీటిలో నడుచుకుంటూ పాఠశాలకు వెళ్తున్న విద్యార్థిని

ఎడతెరిపి లేకుండా వర్షం

- **లోతట్టు ప్రాంతాలు జలమయం**
- **వాహనదారులు, పాదచారుల ఇబ్బంది**

బౌద్ధనగర్/బోయినపల్లి/చిలకలగూడ/మారేడుపల్లి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షానికి సికింద్రాబాద్‌లో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. రోడ్లు చెరువులను తలపిస్తుండడంతో వాహనదారులు ప్రజలు ఇబ్బందులుపడ్డారు. సీతాఫల్‌మండి, బౌద్ధనగర్ డివిజన్లలో శ్రీనివాస్‌నగర్, మహ్మద్‌గూడ, బ్రాహ్మణబస్తీ, మేడిబావి, షాబాద్‌గూడ, బౌద్ధనగర్, వారాసిగూడ ప్రాంతాల్లో రోడ్లు అధ్వానంగా తయారయ్యాయి. గుంతలుపడిన రోడ్లపై వర్షపు నీరు నిల్వడంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడ్డారు. విద్యార్థులు, ఉద్యోగులు, పనుల నిమిత్తం బయటకు వెళ్లే వారు అవస్థలు పడ్డారు.

- మెట్టుగూడలో రోడ్లు జలమయమవడంతో ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడ్డాయి. ఆలుగడ్డబావి, అండ్ బ్రిడ్జి, ఒలిఫెంటా బ్రిడ్జి వద్ద నీరు నిల్వడంతో పాదచారులు అవస్థలుపడ్డారు.
- మారేడుపల్లిలోని ఎల్ శంకర్‌నగర్, అంబేడ్కర్‌నగర్ బస్తీ, టీచర్స్ కాలనీ, నెహ్రూనగర్ కాలనీల్లో వరద నీరు ప్రవహించింది. కార్ఖానా పోలీస్‌స్టేషన్ ఎదురుగా జాతీయ రహదారిపై మోకాలి లోతు నీరు నిలవడంతో వాహనదారులు ఇబ్బందులకు గురయ్యారు. ఓల్డ్ వాసవీ నగర్ కాలనీ, సౌజన్య కాలనీ, సిరిపురి కాలనీ, గృహలక్ష్మి కాలనీ, పికెట్ కృపానంద హాల్, సుబ్బారావు కాలనీలో వరదనీరు చేరింది. వర్షానికి ప్రజలు చాలామంది ఇళ్లకే పరిమితమవడంతో రోడ్లపై రాకపోకలు తగ్గింది.



బౌద్ధనగర్ రామాలయం వద్ద రోడ్డుపై గుంతల్లో నిలిచిన వర్షపు నీరు



మహ్మద్‌గూడ ప్రధానరోడ్డుపై గుంతలు

ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణం..

నేటి నుంచి 9 నెలలపాటు ట్రాఫిక్ మళ్లింపు

బోయినపల్లి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్యారడైజ్ జంక్షన్ నుంచి డెయిరీఫామ్ రోడ్ వరకు జాతీయ రహదారి 44 పై ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణం సందర్భంగా ట్రాఫిక్‌ను మళ్లిస్తున్నామని జాయింట్ కమిషనర్ డి. జోయల్ డేవిస్ తెలిపారు. ఈనెల 30 నుంచి 9 నెలలపాటు ట్రాఫిక్ మళ్లింపులు అమలులో ఉంటాయన్నారు. రాజీవ్ గాంధీ విగ్రహం జంక్షన్ నుండి బాలంరాయ్ వరకు రహదారిని మూసివేస్తున్నామన్నారు. బాలంరాయ్ నుంచి సీటీవో జంక్షన్‌కు వెళ్లేవారు ప్రత్యామ్నాయ మార్గాల్లో వెళ్లాలని సూచించారు. బాలనగర్ వైపు నుంచి పంజాగుట్ట ట్యాంక్‌బండ్ వైపు వెళ్లేవారు తాడ్‌బంద్ మస్తాన్ కేఫ్, డైమండ్ పాయింట్ కుడివైపు మలుపు తిరిగి మడ్‌ఫోర్ట్, ఎన్‌సీసీ, జేబీఎస్, ఎస్‌బీఐ మార్గంలో వెళ్లాలని పేర్కొన్నారు. సుచిత్ర వైపు నుంచి పంజాగుట్ట, ట్యాంక్‌బండ్ వైపు వెళ్లే వారు సేఫ్ ఎక్స్‌ప్రెస్ ఎడమవైపు మలుపు తిరిగి బాపూజీనగర్, సెంటర్ పాయింట్, డైమండ్ పాయింట్, మడ్‌ఫోర్ట్, ఎన్‌సీసీ, జేబీఎస్, ఎస్‌బీఐ మార్గంలో వెళ్లాలని పేర్కొన్నారు. ట్యాంక్‌బండ్ రాణిగంజ్, పంజాగుట్ట, రసూల్‌పురా, ప్లాజా వైపు నుంచి సీటీఓ జంక్షన్ ద్వారా తాడ్‌బండ్ వైపు వెళ్లేవారు రాజీవ్‌గాంధీ విగ్రహం జంక్షన్ నుంచి అన్నానగర్, బాలంరాయ్, తాడ్‌బండ్ ద్వారా, పంజాగుట్ట, ట్యాంక్‌బండ్ వైపు వెళ్లేవారు మీటింగ్ పాయింట్ బైలేన్, హాకీ గ్రౌండ్ బైలేన్, లా అండ్ ఆర్డర్ పోలీస్ స్టేషన్ మార్గాలను ఉపయోగించాలని జాయింట్ సీపీ సూచించారు. ట్రాఫిక్ సమాచారం కోసం హైదరాబాద్ ట్రాఫిక్ పోలీస్ సోషల్ మీడియా ప్లాట్‌ఫాంలను చూడవచ్చని, ప్రయాణ సమయంలో అత్యవసర సహాయం కోసం ట్రాఫిక్ హెల్ప్‌లైన్ నంబర్ 9010203626కి కాల్ చేయవచ్చన్నారు.

బిల్డర్ల సమస్యలు పరిష్కరించాలి

బౌద్ధనగర్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): సమస్యలు పరిష్కరించాలని సికింద్రాబాద్ బిల్డర్స్ అసోసియేషన్ ప్రతినిధులు కోరారు. బుధవారం కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, ఎమ్మెల్యే పద్మారావుగౌడ్, కాంగ్రెస్ పార్టీ సికింద్రాబాద్ ఇన్‌చార్జి ఆదం సంతోష్‌కుమార్, బీజేపీ మహంకాళి సికింద్రాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల సారంగపాణిని కలిసి వినతిపత్రాలు అందజేశారు. ప్లాట్ల రిజిస్ట్రేషన్‌లో ఎదురవుతున్న ఇబ్బందులు, ఎలక్ట్రిక్ మీటర్ల మంజూరు ఆలస్యం, జీహెచ్‌ఎంసీ అనుమతుల్లో తలెత్తుతున్న సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో బిల్డర్లు నేముల ప్రకాశరావు, కుంచాల ఏడుకొండలు, మధు, విజయ్, బి. శ్రీనివాస్‌గౌడ్, అశోక్, సంజయ్, అంబాల రాజేశ్వరరావు, యాదగిరి, రాజుసాగర్, నవీన్‌చారి, నరేష్‌తో పాటు సికింద్రాబాద్ బిల్డర్స్ అసోసియేషన్ కన్వీనర్ మద్దెర్ల శ్యాంసుందర్ పాల్గొన్నారు.



ఎమ్మెల్యే పద్మారావుగౌడ్‌కు వినతిపత్రం అందజేస్తున్న సికింద్రాబాద్ బిల్డర్స్ అసోసియేషన్ ప్రతినిధులు

ఓయూలో ఫ్రెంచ్, జర్మన్ డిప్లొమా కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

ఉస్మానియా యూనివర్సిటీ, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ఫ్రెంచ్, జర్మన్ నాలుగు నెలల జూనియర్, సీనియర్ డిప్లొమా కోర్సులకు 2025-26 విద్యా సంవత్సరానికి ఉస్మానియా యూనివర్సిటీ దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. జూనియర్ డిప్లొమాకు ఇంటర్మీడియట్ ఉత్తీర్ణత, సీనియర్ డిప్లొమాకు జూనియర్ డిప్లొమా లేదా డిగ్రీలో రెండో భాషలో 50 శాతం మార్కులు ఉండాలి. దరఖాస్తులు ఆన్‌లైన్‌లో సమర్పించాలి. దరఖాస్తుల సమర్పణకు చివరి తేదీ డిసెంబరు 6. వివరాలకు 8331041309 ఫోన్ సంప్రదించవచ్చని అధికారులు కోరారు.

విదేశీ విద్యార్థుల కోసం ఇంగ్లిష్ డిప్లొమా కోర్సు

ఉస్మానియా యూనివర్సిటీ ఇంగ్లిష్ లాంగ్వేజ్ ట్రైనింగ్ సెంటర్ (ఈఎల్‌టీసీ) ఆధ్వర్యంలో డిప్లొమా కోర్సు ఇన్ ఇంగ్లిష్ ఫర్ ఫారిన్ స్టూడెంట్స్(డీసీఈఎఫ్ఎస్) బుధవారం ప్రారంభమైంది. 1988లో స్థాపించబడిన ఈ సెంటర్ యూజీసీ అనుమతితో విదేశీ విద్యార్థులు, ఉపాధ్యాయులు, పరిశ్రమల సిబ్బందికి, ఇక్రిసాట్ వంటి సంస్థలకు ప్రత్యేక అవసరాలకు అనుగుణంగా కోర్సులు అందిస్తోంది. ఈ కార్యక్రమాన్ని ఫ్యాకల్టీ ఆఫ్ ఆర్ట్స్ మాజీ డీన్, ఇంగ్లిష్ విభాగం మాజీ అధిపతి ఈఎల్‌టీసీ మాజీ డైరెక్టర్ ప్రొఫెసర్ సి.మురళీకృష్ణ ప్రారంభించారు. ఈఎల్‌టీసీ డైరెక్టర్ ప్రొఫెసర్ బి.విజయ, ఇంగ్లిష్ విభాగం చైర్ పర్సన్ ప్రొఫెసర్ పరిమళ కులకర్ణి, అధ్యాపకులు పాల్గొన్నారు.



ప్రయాణికులతో రద్దీగా ఉన్న సికింద్రాబాద్ రైల్వే స్టేషన్

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో ప్రయాణికుల రద్దీ

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ఒక వైపు భారీ వర్షాలు, నగర శివారులో రహదారుల మూసివేత కారణంగా సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో ప్రయాణికుల రద్దీ పెరిగింది. పలు జిల్లాలకు బస్సులు లేకపోవడంతో బుధవారం ఉదయం నుంచే ప్రయాణికులు సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కు చేరుకున్నారు. టికెట్ బుకింగ్ కౌంటర్లు, ఏటీఎం మెషీన్ల వద్ద ప్రయాణికులు బారులు తీరారు. మొబైల్ రైల్ వన్ యాప్‌లో టికెట్లు బుక్ చేసుకుంటూ ప్రయాణికులు బిజీబిజీగా కనిపించారు.

ఓయూలో 'ఐఈఎల్‌టీఎస్'పై శిక్షణ ప్రారంభం

ఉస్మానియా యూనివర్సిటీ, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ఉస్మానియా విశ్వవిద్యాలయంలోని హ్యూమన్ క్యాపిటల్ డెవలప్‌మెంట్ సెంటర్ (హెచ్‌సీడీసీ) ఆధ్వర్యంలో "టిప్స్ అండ్ ట్రిక్స్ టూ మాస్టర్ ఐఈఎల్‌టీఎస్" పేరుతో మూడు రోజుల ఉచిత శిక్షణ కార్యక్రమం బుధవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా సెంటర్ డైరెక్టర్ ప్రొఫెసర్ జి.విజయచరణ్ మాట్లాడుతూ ఇంటర్నేషనల్ ఇంగ్లిష్ లాంగ్వేజ్ టెస్టింగ్ సిస్టమ్ (ఐఈఎల్‌టీఎస్) ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన ఇంగ్లిష్ నైపుణ్య పరీక్ష అని అన్నారు. ఈ శిక్షణ ద్వారా విద్యార్థులు తమ సామర్థ్యాలను మెరుగుపరుచుకుని మంచి స్కోరు సాధిస్తే విదేశీ విశ్వవిద్యాలయాల్లో ప్రవేశం పొందే అవకాశాలు పెరుగుతాయని తెలిపారు.

ఇంటినుంచి పారిపోయిన మహిళ సఖీ సెంటర్‌కు

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ఇంటి నుంచి పారిపోయి వచ్చిన మహిళను ఆర్పీఎఫ్ పోలీసులు సఖీ సెంటర్‌లో చేర్పించారు. ఆర్పీఎఫ్ నాంపల్లి ఇన్‌స్పెక్టర్ కల్పన తెలిపిన వివరాల ప్రకారం.. తెలంగాణ ఎక్స్‌ప్రెస్‌లో ఎస్-4 బోగీలో ప్రయాణిస్తున్న నీతు కుమారి(35)ని టీటీఈ ధనుంజయ్ టికెట్ అడిగారు. టికెట్ లేదని, ఇంటినుంచి పారిపోయి వచ్చానని ఆమె చెప్పడంతో నీతుకుమారిని నాంపల్లి ఆర్పీఎఫ్ పోలీసులకు అప్పగించారు. ఆమె నుంచి వివరాలు సేకరించి సఖీ సెంటర్‌కు తరలించామని సీఐ తెలిపారు.

బాలుడు చైల్డ్‌లైన్ అధికారులకు అప్పగింత

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): నాంపల్లి రైల్వే స్టేషన్‌లో ఒంటరిగా తిరుగుతున్న బాలుడిని ఆర్పీఎఫ్ పోలీసులు చైల్డ్‌లైన్ అధికారులకు అప్పగించారు. ఆర్పీఎఫ్ సీఐ కల్పన తెలిపిన వివరాల ప్రకారం నాంపల్లి రైల్వే స్టేషన్‌లో ప్లాట్‌ఫాం నంబర్ 4లో పన్నెండేళ్ల బాలుడు ఒంటరిగా తిరుగుతున్నాడు. అతడిని చైల్డ్‌లైన్ అధికారులకు అప్పగించామని సీఐ తెలిపారు. బాలుడి తల్లిదండ్రుల వివరాలు తెలియరాలేదన్నారు.

రేపు శ్రీగిరి ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయం పునఃప్రారంభం

బౌద్ధనగర్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): సీతాఫల్‌మండి డివిజన్ శ్రీనివాస్‌నగర్‌లో రూ. 15 కోట్ల వ్యయంతో చేపట్టిన శ్రీగిరి ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయ పునర్నిర్మాణ పనులు పూర్తయ్యాయి. కంచి కామకోటి శంకరాచార్య శ్రీశంకర విజయేంద్ర సరస్వతి, పుష్పగిరి మహాసంస్థాన పీఠాధీశ్వరులు అభినవోద్దండ విద్యాశంకర భారతి, శ్రీమదష్టాక్షరీ పీఠాధీశ్వరులు త్రిదండి అష్టాక్షరీ సంపతకుమార రామానుజ జీయర్‌స్వామి ఈనెల 31న జీర్ణోద్ధరణ పూర్వక మహాసంప్రోక్షణ మహాకుంభాభిషేకం నిర్వహించి ఆలయాన్ని ప్రారంభిస్తారు.

మూలమూర్తుల శక్తిని ఆవాహనం చేసి రాగికలశాల్లో ప్రవేశపెట్టి, బాలాలయంలో ప్రతిష్ఠించి దీపదూప నైవేద్యాలతో కైంకర్యాలు, ఆర్జిత సేవలను నిర్వహిస్తున్నారు.



ప్రారంభోత్సవానికి ముస్తాబవుతున్న ఆలయం

ఎనిమిది ఆలయాల సమాహారం

ఆలయ ప్రాంగణాన్ని ఎనిమిది ఆలయాల సమాహారంగా తీర్చిదిద్దారు. ప్రధానమైన పద్మావతి, గోదా సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి, సుదర్శన నారసింహస్వామి, ఆంజనేయస్వామి, నవగ్రహాలతో పాటు నూతనంగా కుబేర జ్ఞాన దక్షిణామూర్తి, సీతారామ చంద్రస్వామి ఆలయాలను నిర్మించారు. భక్తులే స్వయంగా అభిషేకం చేసుకునేలా వాయుశివలింగాన్ని ప్రతిష్ఠించారు. భద్రాచలం ఆలయ నమూనాలో వైకుంఠరాముడు ఇక్కడ దర్శనమిస్తాడని, శ్రీకాళహస్తి, తమిళనాడు తిరువత్తియార్‌లో మాత్రమే దక్షిణామూర్తికి ప్రత్యేక ఆలయముందని, తెలంగాణలో ఇదే మొదటి ప్రత్యేక ఉపాలయమని నిర్వాహకులు తెలిపారు.

వెయ్యిటన్నుల కృష్ణశిలలతో..

దేవదాయశాఖ స్థపతి వలినాయగం, ఆలయ పునర్నిర్మాణ కమిటీ ప్రతినిధుల నేతృత్వంలో కాంచీపురం నుండి తీసుకొచ్చిన సుమారు వెయ్యిటన్నుల కృష్ణశిలలతో ఆలయాన్ని పూర్తిస్థాయి రాతికట్టడంగా మలిచారు. ఆయా ఆలయాలు, గోపురాలను కూడా కృష్ణశిలలతోనే నిర్మించటం విశేషం. ప్రధానగోపురం సుమారు 33 అడుగులు, భూపాలపల్లి అడవిలో లభ్యమైన నారవేప వృక్షంతో 55 అడుగుల ధ్వజస్తంభాన్ని ఏర్పాటు చేశారు. దేవతామూర్తుల మూలవిరాట్‌లను మహాబలిపురంలో రూపొందించి, ప్రత్యేక వాహనాల్లో ఇక్కడకు తీసుకొచ్చారు. భక్తుల సౌకర్యార్థం లిఫ్ట్, వాటర్ ప్యూరిఫయర్, వీల్‌చైర్ ర్యాంపు, సోలార్ ఎనర్జీ సిస్టంలను ఏర్పాటు చేశామని ఆలయ ప్రతినిధులు తెలిపారు.



ఉత్సవ విగ్రహాలకు పూజలు

ఆలయంలో ప్రతిష్ఠించనున్న మూలవిరాట్‌లతో పాటు ఉత్సవ విగ్రహాలకు కర్మాంగ స్నపన కార్యక్రమాలను బుధవారం నిర్వహించారు. వేదపండితుల నేతృత్వంలో గర్భాలయాలను శుద్ధి చేసి ప్రాణప్రతిష్ఠ కోసం సిద్ధం చేశారు. ఆలయ కార్యనిర్వహణాధికారి రాజేష్‌కుమార్, ఆలయకమిటీ అధ్యక్ష, ఉపాధ్యక్షులు బసవరాజు శ్రీనివాస్, టి.వేణుగోపాలరావులు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సవ విగ్రహాలకు పూజలు చేస్తున్న అర్చకులు

గుర్తుతెలియని వృద్ధుడి మృతి



వృద్ధుడి మృతదేహం

అడ్డగుట్ట, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్‌లో గుర్తుతెలియని వృద్ధుడు మృతి చెందాడు. గోపాలపురం ఎస్ఐ సుబ్బారావు తెలిపిన వివరాల ప్రకారం.. సికింద్రాబాద్ ఈస్ట్ మెట్రోస్టేషన్ కింద గుర్తుతెలియని వృద్ధుడు చనిపోయి ఉన్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. వృద్ధుడి సంబంధీకులు ఎవరైనా ఉంటే గోపాలపురం పోలీసులను సంప్రదించాలని ఎస్ఐ సూచించారు.

వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరి అదృశ్యం



పురుషోత్తం

బౌద్ధనగర్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు అదృశ్యం అయ్యారు. వారాసిగూడ ఎస్ఐ మల్లికార్జున్ తెలిపిన వివరాల ప్రకారం.. పార్సీగుట్టలో నివసిస్తున్న పురుషోత్తం ప్రధాన్(58)కు కొద్దిరోజులుగా మతిస్థిమితం సరిగా లేదు. ఈనెల 11వ తేదీ సాయంత్రం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. అతడి ఆచూకీ లభించకపోవడంతో కుమారుడు మంగళవారం రాత్రి వారాసిగూడ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బాల రక్షక్ భవన్ నుంచి బాలుడు..



సాయికుమార్

తిరుమలగిరి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): బాల రక్షక్ భవన్ నుంచి బాలుడు అదృశ్యమయ్యాడు. బొల్లారం ఎస్ఐ రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. నిజామాబాద్ జిల్లా నవీపేటకు చెందిన సాయికుమార్ (12) రెండు రోజుల క్రితం తప్పిపోయాడు. కుషాయిగూడ పోలీస్‌స్టేషన్ సిబ్బంది అతడిని బుధవారం బొల్లారం జీవీరెడ్డి కాలనీలోని బాలరక్షక్ భవనానికి తీసుకెళ్లారు. కౌన్సెలింగ్ ఇస్తున్న సమయంలో బాలుడు పోలీసుల కళ్లుగప్పి పారిపోయాడు. బాలరక్షక్ భవన్ మేనేజర్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.